E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం :

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD   సంపుటి :01   సంచిక :241   సోమవారం   10 ఆగస్టు 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్



2 లో

- పహల్గామ్, బాల్తాల్ మార్గాల్లో యాత్ర నిలిపివేత
- ప్రతికూల వాతావరణంతో ముందస్తు జాగ్రత్త చర్యలు
- యాత్ర మార్గాల్లో మరమ్మతులు కొనసాగిస్తున్న అధికారులు
- శనివారం ఒక్కరోజే 3,336 మంది దర్శనం
- ఇప్పటివరకు 4.80 లక్షల మంది భక్తుల దర్శనం
- యాత్రికుల భద్రతే ప్రధాన లక్ష్యమన్న అధికారులు

## బోనాల సందడితో భాగ్యనగరం

- లాల్‌దర్వాజాకు భక్తుల పోటెత్తు
- అమ్మవారి దర్శనానికి భారీ రద్దీ
- పోతురాజుల విన్యాసాలతో హోరు
- 2,500 మంది పోలీసులతో బందోబస్తు
- ప్రముఖుల అమ్మవారి దర్శనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు



2 లో

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు ఆదివారం ఉదయం నుంచి ఘనంగా కొనసాగుతున్నాయి. ఆషాఢమాసం చివరి ఆదివారం రోజు కావడంతో భాగ్యనగరం అంతా అమ్మవారి బోనాలతో నగరమంతా ప్రత్యేక శోభ సంతరించుకుంది. నగరంలోని ఆయా ప్రాంతాల్లో కొలువైన పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, భవాని, మహంకాళి తదితర అమ్మవార్ల ఆలయాలకు బోనం సమర్పించేందుకు భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. మహిళలు వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలు నెత్తినపెట్టుకుని అమ్మవార్ల ఆలయాలకు బయలెల్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బెల్లం సాకపోసి బోనం నైవేద్యంతోపాటు గాజులు, చీరెసారె సమర్పించి తల్లి చల్లంగ చూడమని వేడుకుంటున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువుల చప్పుళ్లతో ఎటు చూసినా నగరమంతా హోరెత్తుతోంది. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారకి ప్రభుత్వం తరఫున అమ్మవారికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించగా, అక్కన్న మాదనన్న మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీధర్ బాబు, అంబర్‌పేట అమ్మవారి ఆలయంలో ప్రభుత్వం తరఫున మంత్రి సీతక్క పట్టువస్త్రాలు సమర్పించారు.

## లష్కరే కమాండర్ అనుమానాస్పద మృతి

- మసీదు వద్దే కుప్పకూలిన కమాండర్
- భోజనం తర్వాత ఒక్కసారిగా మృతి
- మృతికి కారణం ఇంకా సస్పెన్స్
- ఉగ్రవాద సంస్థలో కలకలం
- 30 మంది సభ్యుల హత్యలపై వ్యాఖ్యలు
- కీలక నేతల వరుస మరణాలు

## మహిళలకు ఉచితంగా కొత్త చీరలు

- చిలకపచ్చ రంగులో కొత్త డిజైన్
- నేతన్నలకు భారీ ఆర్డర్లు
- రూ.450 కోట్లతో చీరల ఉత్పత్తి
- 4.62 కోట్ల మీటర్లకు ఆర్డర్లు
- సెప్టెంబరు 20లోగా ఉత్పత్తి పూర్తి
- అక్టోబర్‌లో మహిళలకు పంపిణీ



2 లో

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** మహిళా సంఘాలకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. మహిళా సంఘాలకు అందించే చీరల కోసం మే నెలలో 4.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటివరకు 1.74 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ఉత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో నీలం రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. చీరల ఉత్పత్తి ద్వారా రాజన్న సిరిసిల్ల పవర్‌లూమ్, మ్యాక్స్ సంఘాలకు పని లభించడంతో నేతన్నల్లో ఆశలు పెరిగాయి.

ఈ ఏడాది మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల కోసం ప్రభుత్వం రూ.450 కోట్లను కేటాయించింది.

## మావోయిజం ఖతం.. డ్రగ్స్ భూతం

- యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతం
- డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక వ్యూహాలు అమలు
- ముప్పు స్థాయిని బట్టి గన్‌మెన్ల తగ్గింపు
- భద్రత తగ్గింపులో రాజకీయ కోణం లేదన్న డీజీపీ
- గ్రేహౌండ్స్, ఎస్ఐబీ సేవలకు కొత్త బాధ్యతలు
- సైబర్ నేరాలు, కల్తీపై పోలీసుల ఫోకస్

2 లో

## సర్దిహాలో వింత వ్యాధి కలకలం

- 100 మందికి పైగా తీవ్ర అస్వస్థత
- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు బాధితులు
- గ్రామానికి చేరుకున్న ప్రత్యేక వైద్య బృందాలు
- చిన్నారుల్లో ఒకరిద్దరి పరిస్థితి విషమం
- కలుషిత నీరు, ఆహారంపై అధికారుల అనుమానం
- నమూనాల పరీక్షల తర్వాత కారణం తేలే అవకాశం

2 లో

# కమలం కోటలో జనసేన జోరు



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** తెలంగాణలో పొత్తులు, చేరికల రాజకీయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఎన్డీయే కూటమిలో మిత్రపక్షంగా ఉన్న బీజేపీ, జనసేన మధ్య తాజా పరిణామాలు తెలంగాణలో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. రాష్ట్రంలో తాము ఒంటరిగానే వెళ్తామని బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు స్టేట్ మెంట్ ఇవ్వగా, ఇది రామచందర్ రావు పరిధిలోని అంశం కాదని పొత్తుల అంశాన్ని పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందంటూ జనసేన తెలంగాణ శాఖ అధ్యక్షుడు శంకర్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరువు నేతల మధ్య డైలాగ్ వార్ చల్లారక ముందే మిత్రపక్షం బీజేపీకి జనసేన బిగ్ షాక్ ఇచ్చింది. పలువురు బీజేపీ నాయకులను జనసేన పార్టీలో చేరడం ఇప్పుడు తెలంగాణ బీజేపీలో కలకలం రేపుతోంది. త్వరలోనే బీజేపీలో ఇతర పార్టీల పెద్ద తలకాయలు చేరబోతున్నాయని కమలం పార్టీ అగ్రనేతలు చెబుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం ఇంత కాలం బీజేపీ కోసం సీరియస్‌గా పని చేసిన పలువురు నాయకులు జనసేన గూటికి చేరడం, వారిని స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీకి ఆహ్వానించడంతో తెలంగాణ బీజేపీలో కలకలం రేపుతోంది.

మిగతాది 2 లో..

- కమలం కోటలో కాపు కదలిక
- బీజేపీ నేతలపై పవన్ ఫోకస్
- మిత్రపక్షానికే గట్టి షాక్
- పవన్ దూకుడుతో కమలంలో కలవరం
- బీజేపీ నేతలకు జనసేన గాలం
- సెట్ రైట్ వేళ సరికొత్త ట్విస్ట్
- కమలం క్యాడర్‌లో కొత్త టెన్షన్
- పవన్ ఎంట్రీతో మారుతున్న సీన్
- బీజేపీ-జనసేన మధ్య పెరుగుతున్న గ్యాప్

## ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- 32 జిల్లాల్లో కార్డుల పంపిణీ
- 1.05 కోట్ల కార్డుల పంపిణీకి ఏర్పాట్లు
- 3.42 కోట్ల మందికి ఆహార భద్రత
- సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు
- సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్





2 లో

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆగస్టు 15న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

## 'జెన్-జీని తప్పుదోవ పట్టించారు'

- రాజీనామాపై ధర్మేంద్ర ప్రధాన్ స్పందన
- నీట్ నిరసనలతో పదవికి రాజీనామా
- పదవి కంటే యువతే ముఖ్యమన్న ప్రధాన్
- నవీన్ పట్నాయక్‌పై తీవ్ర విమర్శలు
- 'గో బ్యాక్' నినాదాలకు భయపడను
- రైతు బిడ్డను.. మళ్లీ వస్తూనే ఉంటా



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అంశంపై సీనియర్ బీజేపీ నాయకుడు, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు నోరు విప్పారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జరిగిన నిరసనల సందర్భంగా 'జెన్-జీ' యువతను కొందరు తప్పుదోవ పట్టించారని, ఆ పరిణామాల వల్లే తాను పదవిని వీడాల్సి వచ్చిందని శనివారం వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో జూలై 25న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా తర్వాత దాదాపు రెండు వారాలకు జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన తొలిసారిగా ఈ బహిరంగ ప్రకటన చేశారు.

జెన్-జెడ్ యువత మన పిల్లలలాంటి వారని, కొందరు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

2 లో

## ఆత్మగౌరవం కోసం అండగా నిలుద్దాం



2 లో

- ప్రకృతి పరిరక్షణలో ఆదివాసీల స్ఫూర్తి ఆదర్శం
- ఆదివాసీ సంస్కృతి యావత్ మానవాళికి మార్గదర్శకం
- హక్కులు, అస్తిత్వం, సంస్కృతిని గౌరవించాలి
- జల్-జంగల్-జమీన్ పరిరక్షణలో స్ఫూర్తి ఆదర్శం

## దుర్గమ్మ లడ్డూకు డిజిటల్ ఏటీఎం



2 లో

- ఓటీపీ ఎంటర్ చేస్తే లడ్డూ చేతికి
- ఆన్‌లైన్ బుకింగ్‌తో నేరుగా ప్రసాదం
- ఒక్కసారి ఆరు లడ్డూల వరకు తీసుకోవచ్చు
- దసరా నాటికి ఆరు ఏటీఎంలు అందుబాటులోకి
- క్యూ లైన్లకు చెక్ పెట్టేందుకు కొత్త విధానం
- భారీ రద్దీ నియంత్రణకు డిజిటల్ వ్యవస్థ

# బోనాల సందడితో భాగ్యనగరం

మొదటి పేజీ తరువాయి

మాదన్నపేట నల్లపోచమ్మను కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు.

అట్టహాసంగా లాల్ దర్వాజా బోనాలు:

లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ వార్షిక బోనాల బ్రోహ్మోత్సవాలు కావడంతో అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తెల్లవారుజామునుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలకంరణ చేపట్టారు. దేవాలయం తరఫున అమ్మవారికి తొలిబోనం సమర్పించగా రాత్రి 10:30 వరకు అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం, చీర, సారే సమర్పణ జరిగింది. సాయంత్రం సింహవాహిని అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. 2,500 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు రంగం, భవిష్య వాణి, పోతురాజుల విన్యాసాలు, భవానీ రథ యాత్ర జరగనుంది.

అమ్మవారిని దర్శించుకున్ని సినీ, రాజకీయ ప్రముఖులు

సింహవాహినీ అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుంటున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సినీ నటుడు విజయ్ దేవరకొండ ఆనంద్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెండ్డి వంగా దర్శించుకున్నారు.జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, సింగర్ మంగ్లీ అమ్మవారికి బోనం సమర్పించారు.

# ఆత్మగౌరవం కోసం అండగా నిలుద్దాం

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** ప్రపంచ నాగరికతకు మూలం, ప్రకృతితో మమేకమైన జీవన విధానం – ఆదివాసీ సంస్కృతి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తరతరాలుగా ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానంగా మలుచుకున్న ఆదివాసీ సమాజాల జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమిష్టి జీవన విధానం, సాంస్కృతిక పరిరక్షణ యావత్ మానవాళికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ప్రకృతిని దైవంగా, అడవిని తల్లిగా, తమ సంస్కృతి సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటున్న ఆదివాసీ సోదర సోదరీమణులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారి హక్కులను, అస్తిత్వాన్ని, సంస్కృతిని గౌరవిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం మనమంతా కలిసి నిలబడాలని పేర్కొన్నారు. జల్-జంగల్-జమీన్ పరిరక్షణలో వారి స్ఫూర్తి సదా ఆదర్శం అని కొనియాడారు.

# సర్దిహాలో వింత వ్యాధి కలకలం



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** ఓ గ్రామంలో ఒక్కసారిగా వింత వ్యాధి వ్యాపించడంతో పదుల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రి పాలు కావడం కలకలం రేపింది. ఈ షాకింగ్ ఘటన బీహార్‌లోని సహర్సా జిల్లా పరిధిలోని సర్దిహా గ్రామంలో చోటు చేసుకుంది. దాదాపు 100 మందికి పైగా గ్రామస్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులంతా వికారాలు, వాంతులు, విరేచనాలు, తీవ్ర జ్వరంతో బాధ పడుతుండటంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే వైద్య బృందాలు గ్రామానికి చేరుకుని స్థానికంగా బాధితులకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నాయి.

బాధితులకు చికిత్స కొనసాగుతోందని, వీరిలో ఒకరిద్దరు చిన్నారుల పరిస్థితి కాస్త విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వారిని సదర్ ఆస్పత్రికి తరలించినట్లు జిల్లా సివిల్ సర్జన్ రాజ్ నారాయణ్ ప్రసాద్ తెలిపారు. కలుషిత నీరు, ఆహారం వికటించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి విచారణ, నమూనాల పరీక్షల నివేదికల అనంతరం మాత్రమే ఈ అస్వస్థతకు అసలు కారణాలు స్పష్టంగా తెలుస్తాయని వైద్య అధికారులు వెల్లడించారు.

# లష్కరే కమాండర్ అనుమానాస్పద మృతి



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని కుబా మసీదు వద్ద నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబా సీనియర్ కమాండర్ ఖారీ సయీద్ అబ్దుల్ అజీజ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఒక కొత్త రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం ప్రార్థనల కోసం మసీదుకు వచ్చిన ఆయన, అకస్మాత్తుగా గేటు వద్దే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. మృతికి గల కచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడి కాలేదు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో హతమైన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక, ఇతర సహాయ సహకారాలు అందించే విభాగానికి ఖారీ సయీద్ బాధ్యుడిగా వ్యవహరిస్తున్నాడు.

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వ్యాప్తంగా గత మూడేళ్లలో తమ సంస్థకు చెందిన దాదాపు 30 మంది సభ్యులను "అపరిచిత వ్యక్తులు" హతమార్చారని లష్కరే అగ్రనేత రిజ్వాన్ హనీఫ్ సంచలన వ్యాఖ్యలు చేసిన కొద్దిరోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. 2008 ముంబై దాడుల వెనుక ఉన్న ఈ ఉగ్రవాద సంస్థలోని కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండటం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌లో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఈ మృతిపై స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** జమ్మూ కాశ్మీర్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, యాత్రా మార్గాల రిపేరు పనులు, రాబోయే రోజుల్లో ప్రతికూల వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో పహల్గామ్, బాల్తాల్ రెండింటి మార్గాల నుండి వార్షిక అమర్‌నాథ్ యాత్రను ఆదివారం నుండి తాత్కాలికంగా నిలిపివేశారు. భారత వాతావరణ శాఖ జారీ చేసిన వాతావరణ సూచనలు, ట్రాక్‌ల ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యాత్రను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. రాంబన్ జిల్లాతో పాటు కాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యగా నిన్న జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుండి ఏ కొత్త యాత్రికుల కాన్వాయ్‌ని కూడా అనుమతించలేదు. మరోవైపు.. పవిత్ర గుహలో దర్శనం ముగించుకుని బాల్తాల్ బేస్ క్యాంప్‌లో ఉంటున్న 1,202 మంది యాత్రికులతో కూడిన 28వ బ్యాచ్‌ను 44 వాహనాల కాన్వాయ్‌లో జమ్మూ వైపు వెళ్ళేందుకు అనుమతించారు. తిరుగు ప్రయాణమైన ఈ యాత్రికులలో 867 మంది పురుషులు, 251 మంది మహిళలు, ఒక చిన్నారి, 79 మంది సాధువులు, నలుగురు సాధ్వీలు ఉన్నారు.

నిన్న ఒక్కరోజే మొత్తం 3,336 మంది యాత్రికులు అమర్‌నాథ్ పవిత్ర గుహను దర్శించుకున్నారు. వీరిలో 2,384 మంది పురుషులు, 569 మంది మహిళలు, 21 మంది పిల్లలు, 20 మంది సాధువులు, ఆరుగురు సాధ్వీలు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు మరియు 332 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. దీంతో 2026 అమర్‌నాథ్ యాత్రలో ఇప్పటివరకు పవిత్ర దర్శనం చేసుకున్న మొత్తం యాత్రికుల సంఖ్య 4 లక్షల 80 వేల 19కి చేరింది. కాగా.. జూలై 3న అనంతనాగ్ జిల్లాలోని సాంప్రదాయ చందన్‌వారీ మార్గం, గందర్‌బాల్ జిల్లాలోని బాల్తాల్ మార్గం గుండా ఒకేసారి ప్రారంభమైన ఈ 57 రోజుల అమర్‌నాథ్ యాత్ర, ఆగస్టు 28న సాంప్రదాయ 'ఛడీ ముబారక్' వేడుకతో ముగియనుంది. అయితే.. ఇటీవలి వర్షాల కారణంగా సున్నితమైన యాత్రా మార్గాల్లో రిపేరు, నిర్వహణ పనులు చేపట్టాల్సిన అవసరం ఏర్పడటంతో, సరిహద్దు రోడ్ల సంస్థ ఈ పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తోంది. రాబోయే కొద్దిరోజుల్లో ప్రతికూల వాతావరణం ఉంటుందని ఐఎండ్ హెచ్చరించినందున యాత్రను నిలిపివేస్తున్నామని, యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

సంగారెడ్డిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే మిగిలిన 32 జిల్లా కేంద్రాల్లో కూడా మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3.42 కోట్ల మందికి ఆహార భద్రత

ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. అదనంగా 61.09 లక్షల మంది ఆహార భద్రత పరిధిలోకి వచ్చారు. కొత్త కార్డుల మంజూరుతో తెలంగాణలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరగా, 3.42 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభిస్తోంది. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం సిద్ధం చేసింది. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ఇచ్చారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందు జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న లామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డులను భద్రంగా ఉంచడంతో పాటు సురక్షితంగా రవాణా చేసి, పంపిణీ కేంద్రాలకు సకాలంలో చేరేలా చూడాలని స్పష్టం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరినీ అధికారికంగా ఆహ్వానించి, కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలు.. గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

స్మార్ట్ రేషన్ కార్డుల కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, వివరాల ధ్రువీకరణ, కార్డుల పంపిణీ ప్రక్రియ క్రమబద్ధంగా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించి, రోజువారీ పంపిణీ వివరాలను పౌరసరఫరాల కమిషనర్‌కు నివేదించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో మొత్తం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమంగా చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు సర్క్యులర్ జారీ చేశారు.

# దుర్గమ్మ లడ్డూకు డిజిటల్ ఏటీఎం



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ఒక తీపి కబురు అందించారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దుర్గమ్మ ఆలయంలో సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భక్తులు లడ్డూ ప్రసాదం కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ప్రత్యేకంగా లడ్డూ ఏటీఎం మిషన్లను ఏర్పాటు చేయనున్నారు.

ఈ నూతన విధానంలో భక్తులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా లడ్డూ ప్రసాదాన్ని బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ బుకింగ్ పూర్తి కాగానే భక్తుడి మొబైల్ ఫోన్‌కు ఒక ఓటీపీ వస్తుంది. ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లి ఆ ఓటీపీని ఎంటర్ చేయగానే నేరుగా లడ్డూ ప్రసాదం చేతికి అందుతుంది. ఈ మిషన్ల ద్వారా ఒక వ్యక్తి ఒక్కోసారికి ఒకటి నుంచి ఆరు లడ్డూల వరకు పొందే వెసులుబాటు ఉంటుంది. దసరా సమయానికి ఆలయంలో మొత్తం 6 ఏటీఎం మిషన్లను అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఏటా దసరా ఉత్సవాల సమయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఈ సమయంలో దాదాపు 30 లక్షల నుండి 35 లక్షలకు పైగా లడ్డూ ప్రసాదం విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో, రద్దీని నియంత్రించి ప్రసాద విక్రయాలను వేగవంతం చేసేందుకు ఈ డిజిటల్ ఏటీఎం విధానం ఎంతగానో తోడ్పడనుంది.

# 'జెన్-జీని తప్పుదోవ పట్టించారు'


మొదటి పేజీ తరువాయి

భారతదేశంలో ఏటా కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో 20 కోట్ల మంది పురుడు పోసుకున్నాని పేర్కొన్నారు. వారి అంచనాలు, ఆకాంక్షలు వేరని, రాబోయే రోజుల్లో వారే భారత్‌ను విశ్వగురుగా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు పదవి ముఖ్యం కాదని, అందుకే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాజీనామా సమర్పించినట్లు వివరించారు.

మరొక సభలో మాట్లాడుతూ.. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు, 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' నినాదాలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు వద్ద బీజేడీ యువజన విభాగం చేసిన ఆందోళనలను ప్రస్తావిస్తూ.. తాను ఒక రైతు బిడ్డనని, వెనక్కి పొమ్మన్నా మళ్లీ వస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ యువతను రెచ్చగొట్టి తనపైకి పంపుతున్నారని, తనను ఒడిశా ప్రజలకు ఒక అవమానంగా, చెడు వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

తాను ఎప్పుడైనా ఒడిశా ప్రజలు తలదించుకునే పని చేశానా అని సభను ప్రశ్నించగా, ప్రజల నుంచి లేదని పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్రానికి పెద్దగా గౌరవం తేలేకపోయినా, తన ప్రవర్తనతో ఎప్పుడూ ఒడిశా ప్రతిష్టను దిగజార్చలేదని ప్రధాన్ స్పష్టం చేశారు. పన్నెండేళ్ల క్రితం జగన్నాథ స్వామి, సంబల్‌పూర్ ఆరాధ్య దైవం మా సమలేశ్వరి దేవి ఆశీస్సులతోనే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. విచిత్రమేమిటంటే.. బీజేడీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ ప్రసన్న ఆచార్య సమక్షంలోనే ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# మమతా బెనర్జీ వాహనంపై దాడి.. రాళ్లు, బురదతో విరుచుకుపడిన నిరసనకారులు



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కి ఊహించని షాక్ తగిలింది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బీజ్‌పూర్ పరిధిలో ఆదివారం లాకప్‌లో మృతి చెందిన టీఎంసీ కార్యకర్త బిర్జూ కేఓట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న క్రమంలో ఆమె వాహనంపై గుంపుగా వచ్చిన నిరసనకారులు దాడికి పాల్పడ్డారు.

మమతా కాన్వాయ్‌ని అడ్డుకున్న నిరసనకారులు 'చోర్.. చోర్' అంటూ నినాదాలు చేస్తూ.. ఆమె వాహనంపైకి రాళ్లు, పాదరక్షలు, నీళ్ల బాటిళ్లు, బురదను ఇలా దొరికింది దొరికినట్లుగా విసిరారు. అయితే, ఈ షాకింగ్ ఘటనపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు చూస్తుండగానే అసాంఘిక శక్తులు తన కారుపైకి పెద్ద పెద్ద రాళ్లను విసిరారని తెలిపారు. వాహనంపై దాడి తీవ్ర స్థాయిలో జరిగిందని ఆరోపించారు. ఒకవేళ తాను కారు అద్దాలు గనుక తెరిచి ఉంటే, తలే పగిలిపోయేదని, ప్రాణాలు కోల్పోయేవారని పేర్కొన్నారు. అయితే, ఈ కుట్ర వెనుక పోలీసుల నిర్లక్ష్యం, ప్రత్యర్థి పార్టీల ప్రమేయం ఉందని మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు.

# మహిళలకు ఉచితంగా కొత్త చీరలు



**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** మహిళా సంఘాలకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. మహిళా సంఘాలకు అందించే చీరల కోసం మే నెలలో 4.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటివరకు 1.74 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ఉత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో నీలం రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. చీరల ఉత్పత్తి ద్వారా రాజన్న సిరిసిల్ల పవర్‌లూమ్, మ్యాక్స్ సంఘాలకు పని లభించడంతో నేతన్నల్లో ఆశలు పెరిగాయి.

ఈ ఏడాది మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల కోసం ప్రభుత్వం రూ.450 కోట్లను కేటాయించింది. ఇందులో ఇటీవల రూ.142 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. టెస్కోకు నిధులు మంజూరైన వెంటనే చీరల ఉత్పత్తి చేస్తున్న మ్యాక్స్ సంఘాలకు చెల్లింపులు జరగనున్నాయి. దీంతో ఉత్పత్తి ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. తొలుత 133 మ్యాక్స్ సంఘాలకు చీరల ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించారు. వీటిలో 80 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని పూర్తి చేసిన 61 సంఘాలను గుర్తించి ఇటీవల రెండో విడతగా మరో 1.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు.

ఉత్పత్తి పూర్తయిన వస్త్రాన్ని టెస్కో సేకరిస్తోంది. ఒక్కో చీరకు జాకెట్ వస్త్రంతో కలిపి 6.6 మీటర్ల మేర తయారు చేస్తున్నారు. ఒక్కో చీర ఉత్పత్తికి సుమారు రూ.238 ఖర్చవుతోంది. దీనికి అదనంగా ప్రాసెసింగ్, ప్రింటింగ్, రవాణా తదితర ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది. మొత్తం చీరల ఉత్పత్తి లక్ష్యాన్ని సెప్టెంబరు 20లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. అక్టోబరులో మహిళా సంఘాలకు చీరలను పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. దీంతో గడువులోగా ఉత్పత్తి పూర్తి చేసేందుకు మ్యాక్స్ సంఘాలు పనులను వేగవంతం చేస్తున్నాయి.

మరోవైపు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏకరూప దుస్తుల వస్త్రం విషయంలో నెలకొన్న సమస్యకు కూడా పరిష్కారం లభిస్తోంది. ఫిబ్రవరిలో జిల్లా పరిశ్రమకు 63 లక్షల మీటర్ల వస్త్ర ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు. ఉత్పత్తి ప్రారంభమైన రెండు నెలలకే ఏప్రిల్‌లో ఉత్పత్తిని నిలిపివేయాలని ప్రభుత్వం టెస్కోకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాలుగు నెలలుగా నేతన్నలు అయోమయంలో ఉన్నారు. తాజాగా ఇప్పటికే తయారైన వస్త్రాన్ని సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. 2023 నవంబరులోనూ జిల్లా పరిశ్రమ నుంచి దాదాపు రూ.100 కోట్ల విలువైన వస్త్రాన్ని సేకరించినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో రూ.42 కోట్ల విలువైన వస్త్రానికి లెక్కలు పూర్తయ్యాయి. మరో రూ.50 కోట్ల వరకు విలువైన వస్త్రం ఇంకా పరిశీలించి లెక్కించాల్సి ఉందని అంచనా. ఈ మొత్తాన్ని కూడా త్వరగా విడుదల చేసి ఉత్పత్తిదారులకు చెల్లింపులు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. తాజా చీరల ఆర్డర్లు, పెండింగ్ వస్త్రం సేకరణతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

# మావోయిజం ఖతం.. డ్రగ్స్ భూతం

**న్యూస్ డెస్క్, 09 ఆగష్టు (తెలుగు గళం):** తెలంగాణలో నక్సలిజం (మావోయిజం) పూర్తిగా అంతమైందని, రాష్ట్ర భద్రతకు ఇక ఎలాంటి ముప్పు లేదని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ శాఖలో సమూల మార్పులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై డీజీపీ మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా మావోయిస్టుల అదుపుపైనే దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం, ఇప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొనే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. "ప్రస్తుతం రాష్ట్రం ముందున్న అతిపెద్ద సవాలు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, అక్రమ రవాణా. యువతను, విద్యార్థులను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నాం," అని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ నేతల భద్రతపై స్పష్టత.. : కొందరు రాజకీయ నాయకులు తమ గన్ మెన్‌లను తగ్గించారని పదే పదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో డీజీపీ కీలక వివరణ ఇచ్చారు. మావోయిస్టుల ప్రాబల్యం తగ్గడంతో, దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ ప్రజాప్రతినిధుల భద్రతను సమీక్షించి తగ్గించాం. భద్రతను పూర్తిగా తొలగించలేదు. కేవలం ముప్పు (ఁష్టతీమ్ ౖావతీఎవజ్ఞ్ఆశీఅ) స్థాయిని బట్టి అవసరమైన మేరకు మాత్రమే తగ్గించాం. నిఘా వర్గాల నివేదికలు, సెక్యూరిటీ కమిటీ సూచనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నామనీ, ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో భారీ సంస్కరణలు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. మావోయిస్టుల ఏరివేతలో కీలక పాత్ర పోషించిన గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి బలగాల సేవలను ఇకపై సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, మరియు ఆహార కల్తీ ముఠాల పట్టుకోసం వినియోగించనున్నారు. త్వరలోనే కొత్త 'తెలంగాణ పోలీస్ మాన్యువల్ ను తీసుకురాబోతున్నామని, శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని డీజీపీ వివరించారు.

# కమలం కోటలో జనసేన జోరు

మొదటి పేజీ తరువాయి

షాక్ లో బీజేపీ శ్రేణులు:

జనసేన గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాలపై సీరియస్ గా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే ప్రజాసమస్యలపై పోరాటాలు ప్రారంభంచిన జనసేన.. సంస్థాగతంగా బలోపేతంపై దృష్టి సారించింది. ఓ వైపు జిల్లాల్లో కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తునే మరోవైపు చేరికలపై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నిన్న పవన్ కల్యాణ్ సమక్షంలో 16 మంది నేతలు జనసేనలో చేరారు. వీరిలో నలుగురు బీజేపీ, దాని అనుబంధ సంస్థలకు పని చేసిన వారు కావడం గమనార్హం. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బీజేపీకి చెందిన హైందవి రెడ్డి పాండెం, సనత్ నగర్ కు చెందిన అనిల్ గీడికపల్లి, రవి టెండూల్కర్, బీజేపీ యువజన మోర్చాకు చెందిన ఇల్లందు నియోజకవర్గం నేత గొగ్గల నాగ శ్రావంతిని జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ తమ పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు ఆయా పార్టీలకు చెందిన నేతలు, వివిధ సామాజిక ఉద్యమకారులను సైతం ఆహ్వానించారు. అయితే జాతీయ రాజకీయాల్లో బీజేపీకి అత్యంత నమ్మకమైన, సన్నిహితమైన పార్టీగా ఉన్న జనసేన తెలంగాణలో మాత్రం తమ సొంత నేతలను చేర్చుకోవడం ఇప్పుడు బీజేపీ క్యాడర్?ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

సెట్ రైట్ చేస్తున్న సమయంలో డిస్టర్బ్:

రాజకీయాల్లో పార్టీలు మారడం సహజమే అయినా ఒకే కూటమిలో ఉన్న ఈ రెండు పార్టీల మధ్య సాగుతున్న ఈ రాజకీయం పట్ల పొలిటికల్ సర్కిర్స్ లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర స్థాయి నేతల మధ్య ఉన్న విభేదాలను సెట్ రైట్ చేసి అందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇన్నాళ్లు అగ్రనేతల మధ్య ఉన్న గ్యాప్ కారణంగా పార్టీ డీలా పడిపోయిందని ఇక వీటన్నిటికి చెక్ పెట్టేందుకు అధిష్టానం దూతలు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఇన్నాళ్లు ఎడమొహం పెడమొహం అన్నట్లు ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఒక్కటయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఇటువంటి తరుణంలో బీజేపీపై జనసేన నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, ఆ పార్టీ చర్యలు కమలం పార్టీలో కొత్త డిస్టబెన్స్ కు గురి చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

సొంత ఎజెండానా? పార్టీపై నమ్మకం లేకనా?:

రాష్ట్రంలో వీలైనంత మంది ఇతర పార్టీలోని నేతలను బీజేపీలోకి చేర్చుకోవాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్, మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డ లాంటి కీలక నేతలు రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేస్తుంటే సొంత నేతలు మాత్రం పక్క పార్టీలోకి అది కూడా తమ మిత్రపక్షం గూటికి చేరుతుండటం వెనుక ఏం జరుగుతోందనే చర్చ తెరపైకి వస్తోంది. ముఖ్యంగా బీజేపీపై నమ్మకం లేకనే పార్టీని వీడుతున్నారా? లేక ఇక్కడే ఉంటే అవకాశాలు దక్కవని జనసేనను ఎంచుకుంటున్నారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిజానికి గత కొంత కాలంగా తెలంగాణ బీజేపీలో జరుగుతున్న పరిణామాలు అందరిని ఆశ్చర్య పరుస్తున్నాయి. ఇటీవల తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ సైతం తెలంగాణ నేతలతో గడిపిన సమయం కంటే ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ తో గడిపిన సమయమే ఎక్కువ అనే అభిప్రాయాలు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపించాయి. మోడీ వచ్చి వెళ్లాకే పవన్ కల్యాణ్ తెలంగాణలో స్పీడ్ పెంచినట్లు డిస్కషన్ నడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఏం జరగబోతోంది? ముఖ్యంగా బీజేపీ, జనసేన మధ్య పరిస్థితి ఎలా ఉండబోతోంది అనేది కాలమే సమాధానం చెప్పనుంది.

## ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా రాజేందర్ ఎన్నిక





జాఫర్‌గడ్ మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తాటికాయల రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాఫర్‌గడ్ మండల కేంద్రంలోని స్థానిక రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు తిప్పరబోయిన కృష్ణ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తాటికాయల రాజేందర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఫోటోగ్రాఫర్ సోదరునికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవి తనకు గౌరవం మాత్రమే కాదని, ప్రతి సభ్యుడి పట్ల గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. జాఫర్‌గడ్ మండలంలోని ప్రతి ఫోటోగ్రాఫర్‌ను అసోసియేషన్‌లో సభ్యుడిగా చేర్చేందుకు కృషి చేస్తానని, సభ్యులందరికీ అండగా నిలుస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. కుటుంబ భరోసా పథకం ద్వారా ప్రతి సభ్యుడి కుటుంబానికి భరోసా కల్పించేందుకు

**తెలుగు గళం న్యూస్ జాఫర్‌గడ్ ఆగస్టు 09**

ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభ్యుడికి ఏదైనా కష్టం వస్తే అది ఒక్క సభ్యుడి సమస్య కాదని, సంఘం మొత్తం సమస్యగా భావించి ఆపదలో ఉన్న ప్రతి సభ్యుడికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని రాజేందర్ అన్నారు. మన హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం అందరం ఐక్యంగా నిలబడి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌ను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడు: తాటికాయల రాజేందర్
ఉపాధ్యక్షులు: పాశికంటి విజయ్, నల్లతిగల ప్రసాద్
కార్యదర్శి: తిప్పరబోయిన కృష్ణ
ప్రధాన కార్యదర్శి: బండి దిలీప్ కుమార్
సహాయక కార్యదర్శి: కాటబోయిన సుమన్
కార్యవర్గ సభ్యులు: చెగొండ రమేష్, శామల శ్రీనివాస్, నిరటి సాంబరాజు, సాకి వెంకటస్వామి, సంధి శ్రీకాంత్, సాకి లింగస్వామి, సాకి రాహుల్, నర్సింగోజ్ సంకేత్.

## దర్ధపల్లిలో దండెమ్మ తల్లి బోనాల వేడుకలు

### అమ్మవారిని దర్శించుకున్న ఎర్రబెల్లి ఉష దయాకర్

**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి ఆగస్టు 09**



జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం పరిధిలోని దర్ధపల్లి గ్రామంలో దండెమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి ఉష దయాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఇండ్ల స్థలాల పేదలు జైల్ బరో కు రండి: సీపీఎం"



సత్తుపల్లి, ఆర్ సి, ఆగస్టు09(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి మండలం కాకర్లపల్లి, తుంబూరు గ్రామాలలో ఇండ్లు లేని పేదలతో సీపీఎం నాయకులు జాజిరి శ్రీనివాస్, జ్యోతి లు ఆదివారం సమావేశమయ్యారు. ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు, పక్కా ఇళ్లు ఇవ్వాలని ధర్నాలు చేసినా, వినతిపత్రాలు ఇచ్చినా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని పోలీసులతో నిర్బంధాలను మోపారని మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. నేడు జరిగే జైల్ బరో లో పాల్గొనాలని కోరారు.



## వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

### కొత్తపల్లి, పాముసూర్, ఇప్పగూడెం, చాగల్ గ్రామాల్లో గ్రామసభలు

### రైతులకు అవగాహన కల్పించిన ఏవో కరుణాకర్








**స్టేషన్ ఘనపూర్ ఆగస్టు 9 (తెలుగు గళం న్యూస్):**

జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు అధిక నీటి అవసరం కలిగిన వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. కరుణాకర్ సూచించారు. ఈ మేరకు ఘనపూర్ (స్టేషన్) మండలంలోని కొత్తపల్లి, పాముసూర్, ఇప్పగూడెం, చాగల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు ప్రస్తుత సాగునీటి పరిస్థితులు, నీటి లభ్యత, పంట మార్పిడి, కంటింజెన్సీ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేపట్టి నష్టపోకుండా కందులు, పెసర్లు, అలసందలు, జొన్న, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటి అవసరం కలిగిన కంటింజెన్సీ పంటల వైపు మళ్లాలని రైతులను కోరారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాన్ని కూడా తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ గ్రామసభల్లో సంబంధిత గ్రామాల సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి లో సివిల్ సప్లై హమాలీలు ధర్నా"

### మేనేజర్ రామిశెట్టి శేఖర్ కు వినతి"




సత్తుపల్లి, ఆర్ సి, ఆగస్టు09(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లిలోని సివిల్ సప్లై గోడౌన్ లలో పని చేసే హమాలీ కార్మికులు ఆదివారం గోడౌన్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తమకు వేతనాలు పెంచాలని, పెన్షన్ సౌకర్యం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గోడౌన్ మేనేజర్ రామిశెట్టి శేఖర్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు. రేపు జరగనున్న జైల్ బరో లో పాల్గొంటామని తెలిపారు. సీఐటీయూ నాయకులు మోరంపూడి పాండురంగారావు, సర్వేశ్వరరావు లు పాల్గొన్నారు.

# అక్రమాలకు అడ్డుకట్ట ఎప్పుడు...?

- **ప్రభుత్వం ఉన్నది ఎందుకు..?**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం అంటే ప్రజల కోసం పనిచేసే పాలనా వ్యవస్థ. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, గౌరవం, హక్కులను కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. శాంతిభద్రతలను పరిరక్షించడం, అక్రమాలను అరికట్టడం, అవినీతిని నిర్మూలించడం, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడం పాలకుల కర్తవ్యం. కానీ నేడు పరిస్థితులు చూస్తుంటే ప్రభుత్వం తన బాధ్యతలను ఎంతవరకు సమర్థవంతంగా నిర్వర్తిస్తోంది అన్న ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. రోజూ ఏదో ఒక ప్రాంతంలో మట్టి దందాలు, ఇసుక అక్రమ రవాణా, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, లంచాలు, అవినీతి, మోసాలు, దోపిడీలు, దొంగతనాలు వంటి ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. మరోవైపు మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, మానభంగాలు వంటి దారుణాలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. ఒక ఘటన మరువకముందే మరో ఘటన వెలుగులోకి రావడం ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒక నేరం జరిగిన తర్వాత కేసు నమోదు చేయడం, కొందరిని అరెస్టు చేయడం, విచారణకు ఆదేశించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యతగా భావించరాదు. నేరాలు జరగకుండా ముందుగానే నిరోధించే వ్యవస్థను బలోపేతం చేయాలి. అక్రమాలకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరున్నారు? వారికి సహకరిస్తున్న వారు ఎవరు? అధికారుల నిర్లక్ష్యం ఉందా? రాజకీయ అండదండలు ఉన్నాయా? అనే అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలి. చిన్నచిన్న వారిపై చర్యలు తీసుకుని, పెద్ద అక్రమార్కులను వదిలేస్తే అక్రమాలకు ఎప్పటికీ అడ్డుకట్ట పడదు. ఇసుక, మట్టి వంటి సహజ వనరులు కొందరి దోపిడీకి గురవుతుంటే ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుంది. ప్రజా సంపదను దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అవినీతి, లంచగొండితనం కూడా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒక సాధారణ వ్యక్తి తన న్యాయమైన పని కోసం కూడా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే పాలనా వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది? మహిళల భద్రత విషయంలో మరింత అప్రమత్తత అవసరం. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరాలకు అవకాశం లేకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం ముఖ్యం. పోలీసింగ్‌ను బలోపేతం చేయడంతో పాటు, కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేసి, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా చూడాలి. శిక్ష తప్పదనే భయం నేరస్తుల్లో ఏర్పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది. ప్రభుత్వం అంటే కేవలం పథకాలు ప్రకటించడం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం, ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం మాత్రమే కాదు. ప్రజలకు సురక్షితమైన సమాజాన్ని అందించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. పాలకులు అంటే అధికారాన్ని అనుభవించడానికి కాదు.. ప్రజలకు జవాబుదారీతనంతో సేవ చేయడానికి. అక్రమాలు జరుగుతుంటే వాటిని అరికట్టాల్సింది ఎవరు? అవినీతి పెరుగుతుంటే దాన్ని నిర్మూలించాల్సింది ఎవరు? ప్రజా సంపద దోపిడీకి గురవుతుంటే కాపాడాల్సింది ఎవరు? మహిళలు, సామాన్య




ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే భరోసా కల్పించాల్సింది ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అక్రమాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, అవి జరగకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవాలి. అక్రమార్కులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే అన్న నమ్మకం ప్రజల్లో కలగాలి. ప్రభుత్వం ఉన్నది ప్రజల కోసం.. పాలకులు ఉన్నది ప్రజాసేవ కోసం. ఆ బాధ్యతను విస్మరిస్తే ప్రజల ప్రశ్న ఒక్కటే–అక్రమాలు కొనసాగుతుంటే ప్రభుత్వం ఉన్నది ఎందుకు? పాలకులు ఉన్నది ఎందుకు?

ఇప్పుడు కావాల్సింది ప్రకటనలు కాదు.. కఠిన చర్యలు. తాత్కాలిక స్పందన కాదు.. శాశ్వత పరిష్కారం.

(ముహమ్మద్ సలీం
తెలుగు గళం దినపత్రిక తెలంగాణ స్టేట్ బ్యూరో)

## వర్షాలు సమృద్ధిగా కురవాలని ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం"





**సత్తుపల్లి/ వేంసూరు, ఆగస్టు09(తెలుగు గళం) న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల రామన్నపాలెం గ్రామంలో సుమిత్ర, వెంకటేశ్వరమ్మ నాటు ముఠా ఆధ్వర్యంలో గ్రామ ఆరాధ్య దైవమైన శ్రీ ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు, బావులు నీటితో నిండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. గ్రామ ప్రజలందరిపై ముత్యాలమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## ఏటూరునాగారంలో హోరెత్తిన ఆదివాసీ గర్జన

### ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా.. వై జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ

### కొమురం భీమ్‌కు ఘన నివాళులు.. సంప్రదాయ నృత్యాలతో మార్మోగిన ఏటూరునాగారం



**ఏటూరునాగారం, ఆగస్టు 9:**

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవం వెల్లివిరిసింది. ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, విద్యార్థులు, గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఏటూరునాగారం జనసంద్రంగా మారింది. ప్రధాన రహదారులు ఆదివాసీ నినాదాలతో మార్మోగాయి. వై జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజనులు, యువత, మహిళలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి--సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన నినాదాలతో ర్యాలీ సాగింది. ర్యాలీ అనంతరం కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు జెండా ఆవిష్కరించి ఆదివాసీ సమాజం ఐక్యతను చాటారు. అనంతరం గిరిజన భవన్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

సంప్రదాయ నృత్యాలతో అదరగొట్టిన గిరిజనులు

వేడుకల్లో సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న గిరిజనులు చేసిన ఆదివాసీ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆశ్రమ పాఠశాలలు, పాఠశాలల విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాటం

ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసి దినోత్సవం కేవలం వేడుకలకు పరిమితం కాకుండా ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జల్--జంగల్--జమీన్ పరిరక్షణకు పునరంకితమయ్యే రోజుగా నిలవాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో రాజ్యాంగ హక్కులు, చట్టపరమైన రక్షణలు సమర్థవంతంగా అమలు కావాలని, ఆదివాసీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాలను కోరారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. "ఆదివాసీ ఐక్యతే మన బలం.. హక్కుల పరిరక్షణే మన లక్ష్యం" అనే సందేశంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఆదివాసీల భారీ భాగస్వామ్యంతో ఏటూరునాగారంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక
సోమవారం,
10 ఆగస్టు 2026



# ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి అధికారులు డుమ్మా.. ఆదివాసీ సమాజం ఆగ్రహం!

**ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ గైర్హాజరు బాధాకరం.. ఆదివాసీ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యమా?**

**ఆదివాసీల గోడు వినేందుకు సమయం లేదా? --- వెంటనే స్పందించాలి: ఆదివాసీ సంఘాల డిమాండ్**







తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :

ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారంలో ఆదివాసీ సమాజం భారీగా నిర్వహించిన వేడుకలకు స్థానిక ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడం తీవ్రంగా బాధాకరమని ఆదివాసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆదివాసీల హక్కులు,








సమస్యలు, జల్--జంగల్--జమీన్ పరిరక్షణ, పోడు భూములు, అటవీ హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, మౌలిక వసతులు తదితర అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుంది. ఇలాంటి కీలకమైన రోజున ఆదివాసీ సమాజం మధ్య ఉండాల్సిన ఉన్నతాధికారులు కార్యక్రమానికి దూరంగా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆదివాసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. ఏటూరునాగారంలో వై జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, కొమురం భీమ్‌కు ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం గిరిజన భవన్‌లో వేడుకలు నిర్వహించారు. వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీలు తమ సమస్యలు, డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే మెమోరాండాలు స్వీకరించి, సమస్యలపై ప్రత్యక్షంగా స్పందించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని వారు తెలిపారు. "ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజునే ఆదివాసీలను అధికారులు పట్టించుకోకపోతే.. ఇక మా సమస్యలు ఎప్పుడు వింటారు?" అని ఆదివాసీ సంఘాల నాయకులు ప్రశ్నించారు. ఆదివాసీ ప్రాంతాల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఐటీడీఏ పరిధిలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ వెంటనే స్పందించి ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలపై కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఆదివాసీల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే, ప్రజాస్వామ్య పద్ధతిలో మరింత బలమైన ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆదివాసీ సంఘాలు డిమాండ్.

# నాచారంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు



తెలుగు గళం, నాచారం హైదరాబాద్ ఆగస్ట్ 09 ...

నాచారం ప్రాంతంలో బోనాల పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తుల కోసం పలు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిర్వాహకులు భక్తులకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

# సాయిబాబా కాలనీలో ఘనంగా ఆషాఢ మాసం బోనాలు



తెలుగు గళం : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని సాయిబాబా కాలనీలో ఆషాఢ మాసం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు

ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్ కౌన్సిలర్ రాజు నాయక్ శివ ఎస్పీ కొప్పునూరి ప్రవీణ్ కుమార్ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్ సభ్యుడు సయ్యద్ ఖదీర్ సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి ముబారక్ అలీ ఖాన్ సాదిక్ అనిల్ కుమార్ జయప్రకాష్ రాయికల్ శ్రీనివాస్ కరుణాకర్ బుచ్చయ్య శ్రీధర్ రెడ్డి కుమారస్వామి గౌడ్ రమేష్ సీతారాం శేఖర్ తదితరులు పాల్గొన్నారు అలాగే సాయిబాబా కాలనీ వాసులు శ్రీనివాస్ కిరణ్ ప్రభాకర్ రావు మహదేవన్  వెంకన్న బాబు అమర్‌నాథ్ రెడ్డి బెనూరి చంద్రయ్య మంగ శంకర్ సిద్ధార్థ చంద్రశేఖర్ రెడ్డి శ్రీను అనిల్ తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు

బోనాల సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# పస్రాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా.. తుడుం దెబ్బ ర్యాలీతో దద్దరిల్లిన చౌరస్తా!

**జల్--జంగల్--జమీన్‌పై రాజీ లేదు.. 1/70, అటవీ హక్కుల అమలుకు ఆదివాసీల సమర శంఖం!**

**అధికార యంత్రాంగం కానరాలేదు.. హక్కుల కోసం వందలాది ఆదివాసీల కదలికతో పస్రా హోరెత్తింది!**



తెలుగు గళం గోవిందరావుపేట, ములుగు :

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా చౌరస్తాలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి గుర్తించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్ ఆదివాసి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తుడుం దెబ్బ మండల అధ్యక్షులు గొంది కిరణ్ ఆదివాసి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా తుడుం దెబ్బ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జల్--జంగల్--జమీన్ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఆదివాసీ అమరవీరులకు జోహార్లు అర్పించి, కొమురం భీమ్ దాదాకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా జాతీయ రహదారిపై నిర్వహించిన ర్యాలీలో ఆదివాసీ యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, మేధావులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివాసీ సంప్రదాయ పాటలు, నృత్యాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఆదివాసీ సంస్కృతి, ఐక్యత, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఇంత పెద్ద ఎత్తున ఆదివాసీ సమాజం కార్యక్రమం నిర్వహించినప్పటికీ అధికార యంత్రాంగం నుంచి తగిన స్థాయిలో ప్రతినిధులు కనిపించకపోవడం పట్ల పలువురు ఆదివాసీ పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ ఆదివాసి మాట్లాడుతూ, ఆదివాసీ సమాజంలో ఆత్మగౌరవం, హక్కుల కోసం తుడుం దెబ్బ 1994 నుంచి సాగిస్తున్న పోరాటాలను గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదివాసీలను అవమానించే పదజాలానికి స్వస్తి పలికి, ఆదివాసీ అనే ఆత్మగౌరవ గుర్తింపును మరింత బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. మన భూభాగాన్ని కాపాడుకోవడంతో పాటు ఆదివాసీ బిడ్డలకు విద్య, ఉద్యోగం, సంక్షేమం, ఉపాధి, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన హక్కైన వాటా దక్కేలా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా యువత, విద్యార్థులు చైతన్యవంతులు కావాలని కోరారు. ఆదివాసీ విద్య, ఉద్యోగాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. ఆదిలాబాద్ కారిడార్ నుంచి ఖమ్మం జిల్లా వరకు ఉన్న ఆదివాసీ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాల్లోకి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో నిలిచిపోయిన జీవో నంబర్ 3 విషయంలో ఆదివాసీ ప్రాంతాల ఉద్యోగ హక్కులను పరిరక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 1/70, అటవీ హక్కుల చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. ఆదివాసీల భూములను, హక్కులను పరిరక్షించే 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను బలహీనపరిచే ప్రయత్నాలు జరిగితే వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ అమరవీరులు రాంజీ గోండు, బీర్సా ముండా, కొమురం భీమ్ వంటి మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద గొంది రామచందర్, మాదిగ దండోరా జాతీయ నాయకులు దళిత రత్న నెమలి నర్సయ్య మాదిగ, మాజీ సర్పంచులు పాయం నారాయణ, ముద్ద బోయిన రాము, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే సాయిబాబు, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు తాటి హన్మంత్, స్థానిక సర్పంచ్ భూక్యా సుమలత, ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్, ఆదివాసీ ఎరుకల కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కూరాకుల సమ్మన్న, తుడుం దెబ్బ జిల్లా నాయకులు ఈక జగ్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం సురేష్, ఏజెన్సీ మాదిగ మూలవాసి హక్కుల సమితి అధ్యక్షులు లంజపల్లి రాము, ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆలెం భాస్కర్, అన్నెబోయిన కేశవరావు, ఆదివాసీ నాయకపోడ్ దెబ్బ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి ఏర్న ధనుంజయ్, యాలం ఆదినారాయణ, ఈక లక్ష్మణ్, గట్టి సురేందర్, పెండేకట్ల బాలరాజు, మండల ఆదివాసీ సర్పంచులు పెండేకట్ల విజయ, కుంజ శ్రీను, చల్లగుండ జగత్, ప్రకాష్ రెడ్డి, గౌడ హక్కుల సంఘం జిల్లా నాయకులు కందుల తిరుపతి గౌడ్, కంచర్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







# సోమవారం మాజీ శాసనసభ్యులు, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్కరణ సభ..

**ముఖ్య అతిథులుగా హాజరుకానున్న కేటీఆర్ మరియు హరీష్ రావు**



నర్సంపేట తెలుగు గళం, ఆగస్టు 09....

నల్లబెల్లి మండల కేంద్రంలోని దివంగత నేత మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభ సోమవారం ఉదయం 10:30 గంటలకు పెద్దమ్మ తల్లి గుడి ఆవరణం లో నిర్వహించబడుతుంది, అనంతరం సహపంక్తి భోజనం నిర్వహించబడుతుంది

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు మాజీ మంత్రి హరీష్ రావు హాజరుకానున్నారు

కావున బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాలు, వేలాదిగా తరలివచ్చి తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి..

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.